# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదీ : 26-03-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** సార్వత్రిక ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం చేయాలన్నా రిటర్నింగ్ అధికారుల అనుమతి తప్పనిసరని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా స్పష్టం చేశారు.

**2.** లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాగితం వినియోగాన్ని తగ్గించాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఆదేశించింది.

**3.** భూకక్ష్యలో ఎలాంటి శకలాలకు తావులేని 'జీరో ఆర్బిటల్ డెబ్రీ మిషన్'ను ఇస్రో విజయవంతంగా చేపట్టింది.

**4.** వేసవి కాలంలో అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని తెలంగాణా అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు.

**5.** ఆంధ్రప్రదేశ్‌లోని వై.ఎస్.ఆర్.జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 17 నుండి ప్రారంభమవుతాయి.

==========================

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం చేయాలన్నా రిటర్నింగ్ అధికారుల అనుమతి తప్పనిసరని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. సభలు, సమావేశాలతో పాటు కరపత్రాలు పంపిణీ చేయాలన్నా సువిధ యాప్ ద్వారా లేదా నేరుగా రిటర్నింగ్ అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అన్ని పార్టీలకు నిన్న ఆయన లేఖలు పంపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహించే ప్రముఖ ప్రచారకర్తలు, రాష్ట్ర స్థాయి నాయకులతో పాటు వీడియో కవరేజ్ వాహనాల అనుమతులను ప్రధాన ఎన్నికల అధికారి వద్ద తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకటి కంటే ఎక్కువ జిల్లాల్లో ఊరేగింపులు, యాత్రలు, ర్యాలీలు నిర్వహించినట్లయితే ఆయా జిల్లాల ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరి అని ముఖేశ్‌కుమార్ మీనా వెల్లడించారు.

--------------------------

త్వరలో జరగనున్న లోక్‌సభ,పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పర్యావరణ హితంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఓటరు జాబితా, ఎన్నికల సామాగ్రి కోసం కాగితం వినియోగాన్ని తగ్గించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలకు, రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. eBooks, eDocuments వినియోగాన్ని పెంచాలని సూచించింది. ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్

సమాచార వ్యవస్థ ను ప్రోత్సహించాలనీ, పర్యావరణ అనుకూల ఎన్నికల కోసం ఒక సారి వాడి పారవేసే వ్యర్థాలను నివారించాలనీ కోరింది. అన్ని రకాల వ్యర్థాలు పారవేసేందుకు తగిన సౌకర్యాలను ఏర్పాటుచేయాలనీ, రవాణా కోసం పర్యావరణ అనుకూల వాహనాలను ప్రోత్సహించడంతోపాటు ఎన్నికల సమయంలో కార్‌పూలింగ్ , ప్రజా రవాణాను ప్రోత్సహించాలనీ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో రేపటి నుండి బస్సు యాత్ర ప్రారంభించనున్నారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు దాదాపు 21 రోజులపాటు బస్సు యాత్ర కొనసాగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి సిద్ధం సభలు నిర్వహించిన విశాఖపట్నం, ఏలూరు, అనంతపురం, బాపట్ల జిల్లాలు మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర జరగనుందనీ, ప్రతి రోజూ ఒక పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర కొనసాగుతుందనీ పేర్కొన్నారు.

---------------------------

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ..ఇస్రో మరో మైలురాయిని సాధించింది. ప్రయోగానంతరం భూకక్ష్యలో ఎలాంటి శకలాలకు తావులేని 'జీరో ఆర్బిటల్ డెబ్రీ మిషన్'ను విజయవంతంగా చేపట్టింది. పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్-3.. ఈ నెల 21వ తేదీన భూ వాతావరణంలోకి ప్రవేశించి మండిపోయింది. ఫలితంగా ఆ రాకెట్ ప్రయోగం వల్ల కక్ష్యలో ఎలాంటి శకలాలు ఉత్పన్నం కాలేదని ఇస్రో పేర్కొంది.

---------------------------

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, తిరుమలలో ఈరోజు పర్యటించనున్నారు. ఈ ఉదయం 11 గంటల నుంచి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు వార్షికోత్సవాలను పురస్కరించుకొని శ్రీనివాస ఆడిటోరియంలో 'ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్' అనే అంశంపై నిర్వహించే కార్యశాలను ప్రారంభిస్తారు. రాత్రికి తిరుమల చేరుకోనున్న జస్టిస్ చంద్రచూడ్ రేపు ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

---------------------------

వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణలోని అడవుల్లో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఇటీవల కాలంలో అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లెందు అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ ఘటనల వల్ల వన్య ప్రాణులతోపాటు విలువైన అటవీ సంపదకు ఎక్కువగా నష్టం వాటిల్లుతోందని, అటవీ శాఖతోపాటు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ మేరకు రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి.. పీసీసీఎఫ్ డోబ్రియాల్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణే తెలుగుదేశం,భారతీయ జనతా పార్టీ, జనసేనల లక్ష్యమని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయిడు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన నిన్న బహిరంగ సభలో ప్రసంగిస్తూ తాము అధికారంలోకి వస్తే ప్రతి నియోజకవర్గానికి ప్రణాళిక తయారు చేసి

అభివృద్ధి చేస్తామని తెలిపారు.తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వస్తే అర్హత వున్న వారికి నాలుగు వేల రూపాయల ఫించన్ ను ఇంటి వద్దకే అందిస్తామని పేర్కొన్నారు. కుప్పం పర్యటనలో భాగంగా మహిళలతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళల ఆదాయం రెట్టింపు చేస్తామనీ సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచుతామనీ తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వై.ఎస్.ఆర్. జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 17 నుండి 25వ తేదీ వరకు జరగనున్నాయి. శ్రీ కోదండ రామ స్వామి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఒంటిమిట్టలో నిన్న జిల్లా కలెక్టర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్య నిర్వహనాధికారి వీర బ్రహ్మం సమీక్షించారు. ఏప్రిల్ 22 వ తేదీన సీతారాముల కళ్యాణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అందరూ కృషి చేయాలని వీర బ్రహ్మం కోరారు. ఇలా ఉండగా ... ఏప్రిల్ 16 వ తేదీన బ్రహ్మోత్సవాల అంకురార్పణ, 17వ తేదీ శ్రీరామనవమి రోజున స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మరొక వైపు ... ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో పాల్గొనే భక్తులకు జిల్లా పాలనా యంత్రాంగ విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏర్పాట్లలో భాగంగా భక్తులకు భద్రత కల్పించడం, అన్న ప్రసాదాల పంపిణీ, తాత్కాలిక సౌచాలయాల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటోంది.

-------------------------

తెలంగాణా రాష్ట్రంలో రైతులు ఆందోళనకర స్థితిలో వున్నారని భారత రాష్ట్ర సమితి నాయకులు టి. హరీష్‌రావు అన్నారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఎకరాలలో పంటలు ఎండిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టాలను అంచనా వేసి, ప్రతి ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. భారత రాష్ట్ర సమితి శ్రేణులు పంట పొలాలకు వెళ్లి రైతులకు భరోసా ఇవ్వాలని హరీష్ రావు సూచించారు.

-------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 రెండవ విడత షెడ్యూల్‌ను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు– బీసీసీఐ నిన్న ప్రకటించింది. తొలి విడతలో 21 మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేయగా, నిన్న 53 మ్యాచ్ ల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రస్తుత సీజన్ లో మొత్తం 74 మ్యాచ్ లు జరగవలసి వున్నాయి. రెండవ విడత షెడ్యూల్ మ్యాచ్‌లు ఏప్రిల్ 8 వ తేదీ నుండి ప్రారంభమవుతాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్ షెడ్యూల్ ను బీసీసీఐ విడతల వారీగా ప్రకటించింది. ఫైనల్ మ్యాచ్ మే 26 వ తేదీన చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరుగుతుంది. రెండవ విడతలో హైదరాబాద్ లో ఏప్రిల్ 25, మే 2 , మే 8, మే 16, మే 19వ తేదీలలో అయిదు మ్యాచ్ లు జరుగుతాయి.

-------------------------

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. రెండు రాష్ట్రాల్లోని అనేక జిల్లాలలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలా ఉండగా .... తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మూడు రోజుల పాటు సాధారణ ఉష్ణోగ్రతలకు మించి రెండు లేదా మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం వుందని హైదరాబాదు వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ రెండవ వారం నుండి ఎండల తీవ్రత మరింత పెరుగుతుందనీ, వడ గాల్పుల తీవ్రత కూడా అధికంగా వుండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

-------------------------

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వైద్య, ఆరోగ్య శాఖలో విభాగాధిపతుల నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని ఆ శాఖ వెల్లడించింది. వైద్యవిద్య డైరెక్టర్..డీఎంఈ, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్.. డీహెచ్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్..డీసీఏ, వైద్య విధాన పరిషత్..వీవీపీ కమిషనర్‌లుగా రెగ్యులర్ అధికారులను నియమిస్తామని నిన్న ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో డీఎంఈ పోస్టును ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారని, 2018 వరకు ఈపోస్టును రూపొందించకపోవడంతో అడ్‌హక్ నియామకంతో కొనసాగించారని తెలిపింది. తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎంఈ పోస్టు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల్లోనే పరిష్కరించి.. కొత్త పోస్టు సృష్టించిందని వివరించింది.

======================